# గ్రేటర్ చుట్టూ తనిఖీలు

**నగరంలో విస్తృతంగా తనిఖీలు.. నగదు పట్టివేత**

ఎన్నికల నేపథ్యంలో నగరంలో విస్తృతంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. గ్రేటర్ చుట్టూ ఉన్న హైదరాబాద్‌లోకి ప్రవేశించే మార్గాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని, నగరం నుంచి వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న నగదు, నగలు, ఇతరత్రా వస్తువులను పట్టుకుంటున్నారు. సీజ్ చేసిన నగదు, ఆభరణాలు, ఇతరత్రా వస్తువులకు సంబంధించిన సరైన ఆధారాలు చూపించని సొత్తును సీజ్ చేసి, సంబంధిత అధికారులకు అప్పగిస్తున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లరాదని, పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలు ఉంటే తప్పనిసరిగా వెంట సంబంధిత పత్రాలు ఉండాలని పోలీసు, ఎన్నికల అధికారులు చెబుతున్నారు. తనిఖీలు చేస్తున్న పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా సీనియర్ పోలీసు అధికారుల ప్రజలను కోరారు.



వివరాలను వెల్లడిస్తున్న ఆసిఫ్‌నగర్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

## రూ.2.56 కోట్ల నగదు సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో తొమ్మిది మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం విస్తృతంగా తనిఖీలు చేపడుతూ.. భారీ స్థాయిలో నగదు, అక్రమ మద్యం పట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా శుక్రవారం పోలీసు అథారిటీ ద్వారా రూ.2.56 కోట్ల నగదు సీజ్ చేశారు. ఇప్పటి వరకు రూ.42.28 కోట్ల నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ తెలిపారు. 28 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 1609 మంది బైండోవర్, 1084 నక్కాస్ ఆపరేషన్స్, 715 నాన్ బెయిలబుల్ వారంట్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 2,129 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేసినట్టు వివరించారు.

**మెహిదీపట్నం:** కార్లలో డబ్బులు తరలిస్తున్న సోదరులను ఆసిఫ్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.78 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్ ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. షేక్‌పేట గుల్షన్ కాలనీకి చెందిన మహ్మద్ షహనవాజ్‌ఉద్దీన్(43), మహ్మద్ షాబుద్దీన్(40) సోదరులు. వీరిద్దరూ ఇటీవలే సౌదీ నుంచి వచ్చారు. వీరిద్దరూ గురువారం రాత్రి రెండు కార్లలో ఆసిఫ్‌నగర్ నుంచి గుడిమల్కాపూర్ వెళ్తున్నారు. గుడిమల్కాపూర్‌లోని సాయిబాబా ఆలయం సమీపంలో వీరి కార్లను పోలీసులు తనిఖీ చేయగా.. బ్యాగుల్లో డబ్బులు కనిపించాయి. డబ్బుల గురించి ఆరా తీయగా.. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పోలీసులు ఆ నగదు బ్యాగులను సీజ్ చేశారు. శుక్రవారం ఈ నగదును ఐటీ అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

**కార్వాన్:** గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో పోలీసులు ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.1,02,400 స్వాధీనం చేసుకున్నారు.నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపలేదని, దీంతో ఆ నగదు సీజ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ ముజీబ్ ఉర్ రహ్మాన్ తెలిపారు.

**కుత్బుల్లాపూర్:** పేట్ బషీరాబాద్ పోలీసులు దూలపల్లి చౌరస్తాలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద రూ.5 లక్షల 50 వేల నగదు పట్టుబడింది. పట్టుబడిన నగదును ఎన్నికల అధికారులకు అప్పగించారు.

**బడంగ్‌పేట:** బాలాపూర్ పోలీసులు శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. కారులో తరలిస్తున్న రూ.1,05,000 నగదును సీజ్ చేశారు. ఈ నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపలేదని, దీంతో సీజ్ చేశామని ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు.

**జియాగూడ:** కుల్సుంపురా పోలీసుస్టేషన్ పరిధిలోని కట్ట మైసమ్మ దేవాలయం వద్ద శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మేకల మండి వ్యాపారి రాజ్‌గోపాల్ ద్విచక్రవాహనంపై రూ.ఐదు లక్షలు తరలిస్తుండగా.. పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు .

**జూబ్లీహిల్స్:** సైఫాబాద్ పీఎస్ పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారుడైన రాపోల్ నరేశ్ వద్ద రూ.19.80 లక్షల నగదును పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నారు.

## టీఎస్‌పీఎస్సీ కేసులో నిందితుల హాజరు

**ప్రవీణ్‌ను హాజరుపర్చిన జైలు అధికారులు**

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో 35వ నిందితుడి వరకు శుక్రవారం కోర్టు ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు గైర్హాజరుకావడంతో ఎగ్జామినేషన్ ప్రక్రియను వచ్చేనెల 10వ తేదీకి వాయిదా వేస్తూ.. 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి.ఈశ్వరయ్య ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన నిందితుడు పులిదిండి ప్రవీణ్‌కుమార్‌ను శుక్రవారం జైలు అధికారులు కోర్టులో హాజరుపర్చారు. ప్రవీణ్ రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులో కొనసాగుతున్నాడు. రేణుకా రాథోడ్, ఎల్.డాక్యా, కెతావత్ రాజేశ్వర్‌తో పాటు మరో ఇద్దరు నిందితులు కోర్టుకు హాజరుకాలేదు. దీంతో అందరూ కోర్టుకు హాజరుకావాలని మెజిస్ట్రేట్ సూచించారు. అదేవిధంతో.. 16వ నిందితుడు ప్రశాంత్‌రెడ్డి న్యూజిల్యాండ్‌లో ఉండటంతో అతడిపై కొనసాగుతున్న నాన్ బెయిలబుల్ వారెంట్‌ను తొలగించేందుకు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు వచ్చేనెల 8వ తేదీకి వాయిదా వేశారు. అలాగే, అతడికి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ప్రశాంత్ తరపున న్యాయవాది హైకోర్టులో బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు.

## క్రిమినల్స్‌పై ఫోకస్

**అభ్యర్థుల నేరచరిత్రపై ఆరా తీస్తున్న పోలీసులు**

సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు నగదు, మద్యంపై దృష్టి సారించిన పోలీసులు.. తాజాగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నేర చరిత్రపై ఆరా తీసేందుకు సన్నద్ధమవుతున్నారు. అభ్యర్థుల నేర చరిత్ర, వారిపై నమోదైన కేసులు, న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలు.. తదితర అంశాలను పరిశీలించి, సమర్పించాలని రెండు రోజుల కిందటే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల నేర చరిత్రపై దృష్టి పెట్టారు. అభ్యర్థులపై ఉన్న కేసుల పూర్తి సమాచారాన్ని నామినేషన్ సమయంలో సమర్పించే డిక్లరేషన్‌లో చూపిస్తున్నారా..? లేదా..?., అభ్యర్థులు ఇచ్చిన సమాచారం వాస్తవమేనా..? కాదా..? అనే అంశంపై కూడా ఎన్నికల కమిషన్ దృష్టిపెట్టనుంది. ఈ నేపథ్యంలో పోలీసులు ఆ దిశగా సమాచార సేకరణలో నిమగ్నమయ్యారు. అయితే, బీఆర్ఎస్ మినహా ఇతర ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఇంకా ప్రకటించాల్సి ఉంది. అన్ని పార్టీల నుంచి అభ్యర్థులను ప్రకటించిన తర్వాతే.. అభ్యర్థుల నేర చరిత్రపై నవంబర్ మొదటి వారం నుంచి పూర్తి స్థాయిలో దృష్టి సారించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సేకరించిన అభ్యర్థుల నేర చరిత్ర వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారమిచ్చిన అభ్యర్థులకు నోటీసులు ఇచ్చేందుకు ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

## ఇల్లు కబ్జా.. ఆపై గంజాయి దందా

**రౌడీషీటర్‌ను అరెస్టు చేసిన మధురానగర్ పోలీసులు**

వెంగళరావునగర్, అక్టోబర్ 27 : ఇల్లు కబ్జా చేసి.. ఆపై గంజాయి దందా చేస్తున్న రౌడీషీటర్‌ను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ ప్రధాన రహదారిలోని ఇండియన్ బ్యాంకు ఎదుట ఉన్న ఓ ఫ్లాట్ యజమాని రాజేశ్వర్ గుప్తా.. ఆ ఫ్లాట్‌ను కార్తిక్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. ఇల్లు ఖాళీ చేస్తున్నట్లు 15 రోజుల కిందట కార్తిక్ ఇంటి యజమానికి చెప్పాడు. ఇటీవల ఇంటి యజమాని రాజేశ్వర్‌గుప్తా కుమారుడు శ్రీనాథ్ గుప్తా వచ్చి ఫ్లాట్‌ను చూడగా.. అద్దెకు ఇచ్చిన వ్యక్తి కాకుండా గువ్వల పవన్‌కుమార్ అలియాస్ బిల్లా పవన్ అనే రౌడీషీటర్ కనిపించాడు. ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకొచ్చి.. అక్కడి వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. ఇల్లు ఖాళీ చేయనని.. ఇల్లు ఖాళీ చేయాలంటే తనకు రూ.5 లక్షలు ఇవ్వాలని.. లేకుంటే చంపేస్తానని బెదిరింపులకు గురిచేశాడు. తనతో పెట్టుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాడు. సమాచారం అందుకున్న మధురానగర్ పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా దాడి చేశారు. నిందితుడు పవన్‌కుమార్ నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. అతడిపై రెండు కేసులు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు.

## అసిస్టెంట్ డైరెక్టర్ ఇంట్లోకి..

**అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులపై కేసు**

బంజారాహిల్స్, అక్టోబర్ 27: అసిస్టెంట్ డైరెక్టర్ ఇంటి తాళాలు పగులగొట్టి అక్రమంగా ప్రవేశించడంతోపాటు ఖరీదైన సామాన్లను తస్కరించిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిలింనగర్‌లోని డీ- టైప్ ఫ్లాట్స్‌లోని ఫ్లాట్ నం. 1లో నివాసముంటున్న పి.ఉమారాణి సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. 1996లో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన ఉమారాణి.. అప్పటినుంచి అక్కడే ఉంటున్నారు. బెంగళూరులో ఉంటున్న సోదరుడు రామరాజు వద్దకు ఆగస్టులో వెళ్లిన ఉమారాణి.. ఈనెల 10న తిరిగి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్లి చూడగా.. ఇంట్లో ఉండాల్సిన బట్టలు, ఆభరణాలు, జ్ఞాపికలు.. తదితర వస్తువులు కనిపించలేదు. ఇదిలా ఉండగా, ఈనెల 14న చంద్రశేఖర్ రెడ్డి అలియాస్ చందు, శేఖర్ అనే వ్యక్తులు దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించడంతోపాటు ఇల్లు ఖాళీ చేయాలంటూ బెదిరించారు. ఇల్లు ఖాళీ చేయకపోతే అంతు చూస్తామని హెచ్చరించారంటూ.. బాధితురాలు శుక్రవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఐపీసీ 448,427,379,506 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## పనిచేస్తున్న సంస్థకే కన్నం..

**పోలీసులకు చిక్కిన దొంగలు రూ.8 లక్షల నగదు స్వాధీనం**



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్లు, గడియారాలు

అల్లాపూర్, అక్టోబర్ 27: పనిచేస్తున్న సంస్థకు స్నేహితుడితో కలిసి కన్నం వేసి.. నగదు ఎత్తుకెళ్లిన ఇద్దురిని అల్లాపూర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కూకట్‌పల్లి ఏసీపీ పి.శివభాస్కర్, అల్లాపూర్ ఇస్పెక్టర్ ఆంజనేయులు కథనం ప్రకారం... సూర్యవంశీకుమార్ సంతోష్‌కుమార్ (34) సాయి చైతన్య స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. బోరబండకు చెందిన ఇసాక్ అహ్మద్(27) కారు డ్రైవర్. వీరిద్దరూ స్నేహితులు. వీరిద్దరూ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు. తాను పనిచేసే స్కూల్‌లో చాలా డబ్బులు ఉంటాయని సూర్యవంశీ ఇటీవల ఇసాక్‌తో చెప్పాడు. దసరా సెలవుల్లో స్కూల్లో ఎవరూ ఉండరని, ఆ సమయంలో డబ్బు దొంగలించాలని ఇద్దరూ కలిసి పథకం వేశారు. పథకం ప్రకారం.. ఈనెల 17వ తేదీ తెల్లవారుజాము 3గంటల సమయంలో ఇసాక్ సాయి చైతన్య స్కూల్లోకి చొరబడి.. ఆఫీసు రూమ్ తలుపులకు ఉన్న సెంట్రల్ లాక్‌ను పగులగొట్టాడు. రూ.11,50,000 లక్షలు నగదును తస్కరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ మొదలు పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా వెళ్తుండగా బాలానగర్ సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో సాయి చైతన్య స్కూల్‌లో తన స్నేహితుడితో కలిసి దొంగతనం చేసినట్టు ఇసాక్ ఒప్పుకున్నాడు. దీంతో మరో నిందితుడు సూర్యవంశీని కూడా అరెస్టు చేసిన పోలీసులు, నిందితుల నుంచి రూ.8,00,160 లక్షల నగదు, రెండు ఫోన్లు, రెండు టైటాన్ గడియారాలు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

## పోలీసులమంటూ.. రూ.20 లక్షల దోపిడీ

ఖైరతాబాద్, అక్టోబర్ 27 : పోలీసుల పేరుతో దుండగులు వాహనాల తనిఖీ చేపట్టి.. ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.20 లక్షలు దోచుకుపోయారు. ఈ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై హరీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్‌కు చెందిన ప్రదీప్ శర్మ చిమన్‌లాల్ సురేశ్ టెక్స్‌టైల్ ఉద్యోగి. బ్యాంకులో డిపాజిట్ చేయమని సూచిస్తూ అదే సంస్థలో పనిచేస్తున్న అక్షయ్ రూ. 20 లక్షల నగదును ప్రదీప్ శర్మకు ఇచ్చాడు. గురువారం రాత్రి ఆ నగదుతో ప్రదీప్ శర్మ బంజారాహిల్స్ రోడ్ నం.1లోని తాజ్ కృష్ణ మీదుగా కారులో వెళ్తుండగా, ఇద్దరు వ్యక్తులు వాహనాన్ని ఆపారు. తాము పోలీసులమంటూ పరిచయం చేసుకొని.. వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. తనిఖీల్లో ప్రదీప్ తీసుకెళ్తున్న రూ.20 లక్షలు వారికి కనిపించాయి. ఈ డబ్బు ఎక్కడిదని ప్రశ్నించారు. తన యజమాని బ్యాంకులో డిపాజిట్ చేయామని ఇచ్చారని చెప్పాడు. దుండగులు ఆ నగదు బ్యాగును తీసుకొని.. తమ వెంట రావాలని సూచించారు. దుండగులు అతడిని కారులో కూర్చోబెట్టుకొని బయలుదేరారు. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద కారును ఆపారు. అతడిని కిందకు దించి.. బ్యాగును చేతిలో పెట్టి వెళ్లిపోయారు. ఆ బ్యాగును తీసుకెళ్లి యజమానికి ఇవ్వగా.. అందులో ఉండాల్సిన రూ.20 లక్షల నగదుకు బదులు.. కేవలం రూ.1.50 లక్షలు మాత్రమే కనిపించాయి. పోలీసుల పేరుతో దుండగులు వాహనం తనిఖీ చేసి, నగదు దోచుకుపోయారని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.